క్లుప్తంగా

సుబ్రహ్మణ్య కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 23వ శాంతి కల్యాణ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, రక్షా బంధన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అఖండ దీక్షాధారణ, వాస్తు హోమం, మండపారాధన నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు రవికుమార్ శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి కలగర శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడిన వ్యక్తి విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు వివరాల ప్రకారం.. గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మర్లపాలెం రైల్వే గేటు వద్ద ఈనెల 15న రాత్రి 8.50 గంటల సమయంలో గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి సుమారు 55 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని 108 అంబులెన్స్‌లో విజయవాడ జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి, అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు నెల్లూరుకి చెందిన కాయల ఏడుకొండలుగా గుర్తించారు. మృతుడు 5.7 అడుగుల ఎత్తు, ఒంటిపై ఆకుపచ్చ, పసుపు రంగు అడ్డచారల టవల్ ఉందని తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు సెల్ నెంబర్ 80740 55378లో సంప్రదించాలని కోరారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షకు సన్నద్ధమవుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బీసీ (రూ.లక్షలోపు ఆదాయం), ఎస్సీ, ఎస్టీ (రూ.రెండు లక్షలలోపు ఆదాయం ఉన్న) అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఆర్‌వీ నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23లోగా శనివారపుపేటలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని, ఈ నెల 27 నుంచి శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణా కాలంలో స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని, 100 మంది అభ్యర్థులకు 50 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం ఫోన్ నెంబర్లు 99123 94799, 83419 91001లో సంప్రదించాలని కోరారు.

విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు



మూర్తిరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, విద్యాదాత, స్వాతంత్ర్య సమరయోధులు చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు 104వ జయంతిని పురస్కరించుకుని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక కోర్టు సెంటర్‌లోని మూర్తిరాజు విగ్రహానికి శనివారం పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాలను శాసించారని గుర్తు చేశారు. విద్యాసంస్థల కోసం 1800 ఎకరాలు దానం చేసిన గొప్ప దాత అన్నారు. ఏలూరు నగర నడిబొడ్డున ఉన్న సెయింట్ ఆన్స్, థెరిస్సా కాలేజీలకు స్థలాలు ఆయన దానంగా ఇచ్చినవే అని వివరించారు. సర్వోదయ ఉద్యమానికి జిల్లాలో ఊతమిచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ మూర్తిరాజు అంటేనే సేవామూర్తి, త్యాగమూర్తి అన్నారు. కార్యక్రమంలో వెంపా నాగరాజు, సిద్దూ, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.

మూర్తిరాజు దంపతుల చిత్రపటం ఏర్పాటు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల ఆడిటోరియంలో విద్యాదాత చింతలపాటి మూర్తి రాజు, సత్యవతి దేవిల చిత్రపటాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కళాశాలల ఆడిటోరియంలో చింతలపాటి మూర్తి రాజు, సత్యవతి దేవిల చిత్రపటం ఏర్పాటు కోసం పాలకొల్లుకు చెందిన మంతెన నరసింహరాజు, పీఎల్ రాజు వర్మ కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయించిన దాత మూర్తిరాజుకు దక్కిన గౌరవంగా మంతెన నరసింహరాజు, రిటైర్డ్ ఏఎస్‌పీ దండు భగవాన్ రాజు, ఆర్కే రాజు అభివర్ణించారు.

ఉన్నత భావాలు అలవరుచుకోవాలి



ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థినులు ఉన్నత భావాలను అలవరుచుకుని ప్రతి ఒక్కరినీ ప్రేమపూర్వకంగా ఆదరించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నచిన్న త్యాగాలు చేయడం ద్వారా పెద్దపెద్ద లక్ష్యాలు సాధించడం తేలికౌతుందని చెప్పారు. 70 సంవత్సరాల చరిత్రలో సెయింట్ థెరిస్సా కళాశాల మహిళా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని, ఈ కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థినులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగారని గుర్తు చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యానికి, విద్యార్థినులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సెయింట్ ఆన్స్ ఈస్టర్న్ ప్రోవెన్స్ సుపీరియర్ సిస్టర్ సొరీలు మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, లక్ష్యాన్ని చేరే వరకూ అకుంఠిత దీక్షతో కృషి చేయాలని సూచించారు. గౌరవ అతిథి ఐఎంఆర్‌ఎఫ్ సీఈఓ ప్రొఫెసర్ రత్నాకర్ మాట్లాడుతూ తమ సంస్థకు మహిళా కళాశాలతో ఎంతో అనుబంధం ఉందని, భవిష్యత్‌లో కూడా ఈ బాంధవ్యం కొనసాగుతుందని చెప్పారు. కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ ర్సెస్టీన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ తాను ఈ కళాశాల విద్యార్థినేనని, తాను కరస్పాండెంట్‌గా ఉండగా కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం తనకు వర్ణనాతీత అనుభూతినిస్తోందని తెలిపారు. విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, పూర్వపు ప్రిన్సిపాల్స్ సిస్టర్ మరియట్ట పూదోట, థెరిస్సా చెరియన్, సిస్టర్ మరియట్ట డిమెల్లో తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జికి ఘన నివాళి



ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఎమ్మెల్సీ షేక్ సాబ్జికి శనివారం జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ఘన నివాళులర్పించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ, ప్రసాద్‌తో పాటు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కేఎస్ఎస్ సుబ్బారావు, ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి ఎస్ నిర్మల జ్యోతి, కార్యాలయ సిబ్బంది సాబ్జీ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సాబ్జి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎమ్మెల్సీ సాబ్జీ కుటుంబ సభ్యులను స్థానిక సత్రంపాడులోని ఆయన నివాస గృహంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. వీరిలో డీఈఓ పి.శ్యామ్ సుందర్, వైఎస్సార్ సీపీ నాయకుడు మెడికల్ బోర్డు సభ్యుడు దిరిశాల వరప్రసాద్, యూటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు. సాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మసీదుపాడులోని ఎంపీపీ పాఠశాలలో సాబ్జీ సంతాప సభ నిర్వహించారు. సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ విచారం వ్యక్తం చేశారు.



సాబ్జి కుమారుని పరామర్శిస్తున్న డీఈఓ శ్యామ్ సుందర్

సీపీఎం సంతాపం

ఏలూరు (టూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక నేత ఎమ్మెల్సీ సాబ్జి అకాల మృతికి సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. స్థానిక పవరుపేటలోని జిల్లా కార్యాలయంలో నాయకులు సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కమిటీ సభ్యులు మంగరాజు సాబ్జి సేవలను గుర్తు చేశారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో సాబ్జీ సంతాప సభ నిర్వహించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ సాబ్జి ఎంతో కృషి చేశారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సీపీఎం, యూటీఎఫ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

టాటా క్లాస్ ఎడ్జ్ విద్యా సంస్థ ప్రారంభానికి సన్నాహాలు



'టాటా క్లాస్ ఎడ్జ్' బ్రోచర్ విడుదల చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా సౌకర్యం అందించేందుకు టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని టాటా క్లాస్ ఎడ్జ్ విద్యా సంస్థను ఏలూరు నగరంలో వచ్చే 2024 – 25 విద్యా సంవత్సరానికి ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యలమంచిలి నాగేంద్ర శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక గ్రీన్ సిటీలోని సంస్థ పరిపాలనా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక శాంతి నగర్ 13వ రోడ్డులో ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు డిజిటల్ స్క్రీన్ ద్వారా టాటా క్లాస్ ఎడ్జ్ ప్రోగ్రాంతో పాఠ్యాంశాలు బోధిస్తామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను గుర్తించి వారికి నైపుణ్యాలు పెంచే రీతిలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ విద్యా సంస్థలో 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా తీర్చిదిద్దే ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ బ్రోచర్ విడుదల చేశారు. సమావేశంలో అకడమిక్ అడ్వైజర్ సూరంపూడి రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎ.వీరభద్ర రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పవర్‌పేట, జీఎన్‌టీ రోడ్డు, పాత బస్టాండు సెంటర్, గూడ్స్‌షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మత్స్యశాఖ పథకాలపై అవగాహన కల్పించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలపై రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో డిస్‌ప్లేబోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖాధికారులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం మత్స్యశాఖపై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని మత్స్యకార సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. 2021 డిసెంబర్ తదుపరి చేపల చెరువులకు తీసుకున్న విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. 73వ అధికరణం క్రింద జిల్లా పరిషత్‌కు బదలాయించిన సొమ్ము లబ్ధిదారులకు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్ నిర్మల జ్యోతి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఎఫ్‌డీఓలు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి చేయూత

దెందులూరు: పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలు విక్రయించగా వచ్చిన నగదుతో పాఠశాల సిబ్బంది కొంత నగదు కలిపి అనాథాశ్రమానికి చేయూత అందిస్తున్నామని సెయింట్ మేరిస్ యూపీ పాఠశాల హెచ్ఎం సిస్టర్ టీనా, ప్రొవెన్షియల్ లీసా అన్నారు. శనివారం దెందులూరు సెయింట్ మేరిస్ యూపీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్త ఆధ్వర్యంలో 18 రకాల ఆహార పదార్థాలు, పానీయాలు తయారు చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామస్తులకు వాటిని విక్రయించారు. సిస్టర్ టీనా మాట్లాడుతూ ఏటా పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి అనాథాశ్రమాలకు తమ వంతు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఓకేషనల్ కౌన్సిలర్ సిస్టర్ శాంటా, సిస్టర్ జూల్లీట్, విన్నీ మరియా, స్మితా, పాఠశాల అధ్యాపకులున్నారు.

సంచార పశువైద్య సేవలు సంతృప్తికరం



సంచార పశువైద్య అంబులెన్స్‌లను తనిఖీ చేసిన బృందంతో సిబ్బంది

ఏలూరు (టూటౌన్): రైతులకు సేవలను అందించడమే ఈఎంఆర్ఐజీహెచ్ఎస్ పశువుల అంబులెన్స్‌ల లక్ష్యమని సంస్థ హెచ్‌ఆర్ సత్యప్రసాద్, జిల్లా మేనేజర్ పాట్నూరి నరేష్ అన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సేవలు అందిస్తున్న 1962 అంబులెన్స్‌లను స్థానిక జిల్లా పశుసంవర్ధకశాఖ ఆవరణలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల అంబులెన్స్ సిబ్బందికి, రైతులకు మెరుగైన సేవలు ఎలా అందించాలో సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులకు నేరుగా ఫోన్ చేసి 1962 అంబులెన్స్ సేవల పట్ల ఆరా తీశారు. సంచార పశువైద్య వాహనాల సేవలను పొందిన రైతులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ఏలూరు జిల్లా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పశువుల అంబులెన్స్‌ల పనితీరును ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పశువుల రైతులకు అవసరమైన, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సేవలు అందిస్తున్న 1962 అంబులెన్స్ వాహనాల్లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	24
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	05
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	05
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	34820	02
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు –తిరుపతి	16.00	4830	36